## క్లుప్తంగా

### 13న వీరభద్రుని రథోత్సవం

తుగ్గలి: మండల పరిధిలోని ఎద్దులదొడ్డిలో వెలసిన వీరభద్రేశ్వర స్వామి తిరునాల ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు గ్రామస్తులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 12న గణపతిపూజ, 13న భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి కల్యాణం, సాయంత్రం రథోత్సవం, 14న వసంతోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

### వైభవంగా వసంతోత్సవం

తుగ్గలి: ఉగాది వేడుకల్లో భాగంగా మండల పరిధిలోని జొన్నగిరిలో గురువారం వసంతోత్సవాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. చిన్నా పెద్దా తేడాలేకుండా ఒకరికొకరు రంగులు చల్లుకున్నారు. అనంతరం వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి ఉత్సవమూర్తులను రథంపై ఉంచి మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

### హోరాహోరీగా బండలాగుడు పోటీలు


మిట్టసోమాపురంలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

నందవరం: మండల పరిధిలోని మిట్టసోమాపురం గ్రామంలో క్రోధి నామ సంవత్సరం పురస్కరించుకుని గురువారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహా, లింగన్న ప్రారంభించారు.హోరాహోరీగా సాగిన పోటీల్లో గ్రామానికి చెందిన ఎద్దు మొదటి నాలుగు స్థానాల్లో నిలిచాయి. విజేత బోయ రాజు ఎద్దు రూ.15,016, రెండవ స్థానం జాన్ వృషభాలు రూ.10,016, మూడవ స్థానంలో ఎర్ర లింగన్న ఎద్దు రూ.5,016, నాల్గవ స్థానం శివ ఎద్దు రూ.3,016 గెలుపొందాయి. దాతలు నరసింహులు, లింగన్న, వెంకటప్ప, శివ, రామాంజనేయులు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

### దరఖాస్తు గడువు పొడిగింపు

చిప్పగిరి: కేజీబీవీల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు స్థానిక కేజీబీవీ ఎస్ఓ సౌజన్య గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ 2024–2025 సంవత్సరానికి గాను అడ్మిషన్ దరఖాస్తు గడువు ఈ నెల 11వ తేదీతో ముగియగా తాజాగా 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు చెప్పారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ విధానంలో ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 18004258599ను సంప్రదించవచ్చన్నారు.

### తిమ్మగురుడు స్వామికి పల్లకీసేవ


పల్లకీలో ఊరేగుతున్న తిమ్మగురుడు స్వామి

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకలచెర్వు గ్రామంలో తిమ్మగురుడి తిరునాలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. గురువారం స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామ వీధుల గుండా ఊరేగించారు. అనంతరం వసంతసేవను యువకులు ఉత్సాహంగా జరుపుకున్నారు. సాయంత్రం నందికోల సేవ కార్యక్రమాలు జరిగాయి. తిరునాల సందర్భంగా గ్రామంలో మిఠాయి, తదితర అంగళ్లతో కళకళలాడుతున్నాయి. ఫ్యాక్షన్ గ్రామం కావడంతో కార్యక్రమాలన్నీ పోలీసు బందోబస్తు మధ్య జరుగుతున్నాయి.

### యూటీఎఫ్ మాసపత్రిక ఆవిష్కరణ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం 'ఐక్య ఉపాధ్యాయ మాసపత్రిక'ను ఆ సంఘ నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. ఈ పత్రిక విద్య, ఉపాధ్యాయ సమకాలిన పరిస్థితులకు సంబంధించిన వ్యాసాలు అధ్యయనం చేయడానికి, సామాజిక పరిస్థితులను అవగాహన చేసుకొనేందుకు ఉపయోగపడుతుందన్నారు. యూటీఎఫ్ నాయకులు నాగమణి, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

### జింకపిల్ల అప్పగింత


ఏఎస్‌ఐ చెన్నయ్యకు జింక పిల్లను అప్పగిస్తున్న రైతు

మద్దికెర: మంద నుంచి తప్పిపోయి వచ్చి మద్దికెర శివార్లలోని నల్లరేగడి పొలాలలో తిరుగుతున్న జింక పిల్లను రాజు అనే రైతు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ చెన్నయ్యకు అప్పగించారు. ఏఎస్‌ఐ మాట్లాడుతూ జింకపిల్లను అటవీ శాఖ అధికారులకు అందజేస్తామన్నారు.


నందవరంలో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న శివారెడ్డి గౌడ్


ఎమ్మిగనూరులో ప్రత్యేక నమాజులో పాల్గొన్న ముస్లింలు


మద్దికెర ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


వెల్దుర్తి ఈద్గాలో దువా చేస్తున్న ముస్లింలు


భంభం స్వామి దర్గా వద్ద మత పెద్దలకు సన్మానం

# భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్


హొళగుందలో ఊరేగింపుగా వస్తున్న ముస్లింలు


రంజాన్ శుభాకాంక్షలు చెప్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి


ఆలూరు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

సాక్షి నెట్‌వర్క్: రంజాన్ పండుగను గురువారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. నెలరోజుల పాటు కఠినమైన ఉపవాస దీక్షలు ఆచరిస్తూ, మహమ్మద్ ప్రవక్త బోధనలను పఠిస్తూ మసీదుల్లో 'తరావీ నమాజ్' ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ వచ్చారు. గురువారం ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాల వద్ద మతపెద్దలు మాట్లాడుతూ అల్లా యందు భక్తివిశ్వాసములతో సక్రమ మార్గంలో నడుచుకుంటున్నవారికి పవిత్రమైన జీవితం ప్రసాదించబడుతుందని దివ్యసందేశాన్ని వినిపించారు.

➡ ఎమ్మిగనూరులోని కమిటీ రోడ్డులోగల ప్రధాన ఈద్గాతో పాటు, ఎస్‌బీఐ వద్దగల ఈద్గా, పలు మసీదులకు ముస్లింలు ఉదయాన్నే వెళ్లి ప్రత్యేక సామూహిక రంజాన్ నమాజులు చేశారు. కొత్త వస్త్రాలు ధరించి భక్తిశ్రద్ధలతో అల్లాహ్‌ను ప్రార్థించారు. పట్టణంలోని కమిటీ రోడ్డులోని ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో మతగురువు మహమ్మద్‌బాషాసాహెబ్ ఖాద్రీ ఈద్-ఉల్-ఫితర్ విశిష్టతను వివరిస్తూ దైవ ప్రవచనాలను వినిపించారు. పేదల బాధ తెలుసుకొనేందుకు రంజాన్ ఉపవాసాలు దోహదపడుతాయని వివరించారు. ప్రతిఒక్కరు తమ సంపాదనలో కొంతమేర దానధర్మాలు చేయడం వల్ల రెట్టింపు పుణ్యం కలుగుతుందనిన్నారు. మహమ్మద్ ప్రవక్త స్మరణతోపాటు ఆయన సూచించిన మార్గంలో నడవాలని అప్పుడే పాపాలు అంతరించి మోక్షం సిద్ధిస్తుందన్నారు. ఖురాన్‌లోని ప్రవచనాలను వివరించారు. ప్రజల కష్టాలు తొలగి మంచి చేకూరాలని, మానవత్వం పరిమళించాలని ప్రవక్తను దువా రూపంలో ప్రార్థించారు. మత పెద్దను కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈద్గాలు, మసీదుల వద్ద పట్టణ సీఐ మధుసుదన్‌రావ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.


పత్తికొండ ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

➡ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే: పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక సోదరుడు యుగంధర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. వారిని ముస్లిం నాయకులు శాలువాలతో సత్కరించారు. వక్ఫ్ బోర్డ్ జిల్లా ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, జామియా మసీదు కమిటీ అధ్యక్షులు ఖాశీంబేగ్, మున్సిపల్ కౌన్సిలర్లు వాహిద్‌ఇషాక్, అమాన్, షబ్బీర్‌అహమ్మద్, షాబుద్దీన్, సయ్యద్‌చాంద్, బాబుఖాన్ అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మిగనూరులో దువా చేస్తున్న మత పెద్ద


ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, బుట్టా యుగంధర్


ఆస్పరి ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

# కార్యకర్తలు సంసిద్ధులు కండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు సంసిద్ధులు కావాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సూచించారు. గురువారం స్థానిక కమ్యూనిటీ హాలులో మండల కన్వీనర్ గంపల వెంకటేశ్వర్లు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించేందుకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందించిన వైఎస్ జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాల్సిందిగా ప్రజలను ఓటు అడిగే హక్కు మనకుందన్నారు. ప్రతి ఇంట్లో జగనన్నను తమ సొంత బిడ్డగాను, అన్న, తమ్ముడు, మావయ్యగా చూస్తున్నారనే విషయాన్ని పార్టీ కార్యకర్తలంతా గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రత్యర్థుల తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని, ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఏకమై కలిసికట్టుగా పార్టీ విజయానికి కష్టపడాలన్నారు. జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, సర్పంచులు మల్లికార్జున, విజయుడు, మార్కెట్‌యార్డు చైర్మన్ పక్కీరప్ప, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, వెంకటేశ్వరరెడ్డి, సీతారామిరెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

- వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి
- పార్టీలో చేరేందుకు భారీగా తరలివస్తున్న నాయకులు
- 100 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

# జగనన్న అంటే నమ్మకం


హొళగుందలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువా వేస్తున్న విరూపాక్షి

హొళగుంద: వైఎస్ జగనంటే నమ్మకం.. మాటిచ్చారంటే నెరవేర్చి తీరుతారు.. గత ఐదేళ్ల పాలనతో అది నిరూపితం అయ్యిందని, దీంతో టీడీపీ, ఇతర పార్టీల వారు స్వచ్ఛందంగా వచ్చి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని పార్టీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి అన్నారు. ఎన్నికల ముందు వందల్లో హామీలిచ్చి తరువాత మాట మార్చే చంద్రబాబునాయుడును ప్రజలు నమ్మడం లేదన్నారు. గురువారం హొళగుందకు వచ్చిన ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

**టీడీపీకి షాక్..**

ఏళ్ల తరబడి టీడీపీకి మద్దతుగా ఉంటున్న నాయకులు, కార్యకర్తలు దాదాపు 100 కుటుంబాల వారు గురువారం హొళగుందకు వచ్చిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. సుంకులమ్మ ఆలయ పరిసరాల్లో ఉంటున్న కాకి పక్కీరప్ప, శ్రీరాములు, వెంకటేష్, ఓబులేసు, వెంకటేష్‌తో పాటు 40 కుటుంబాలు, అలాగే ఈర్ల కట్ట వద్ద ఉంటున్న కురువ కులస్తులు కురువ ప్యాటిప్ప, పెద్దకోటి గాదిలింగ, మంజు, గడిగె నాగప్ప, బీరప్ప, శేఖర్‌తో పాటు దాదాపు 60 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి విరూపాక్షి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, ఈశా, నిసార్, కోగిలతోట శేషప్ప, మల్లికార్జున, కెంచప్ప, హనుమప్ప, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక**

చిప్పగిరి: మండల కేంద్రంలో టీడీపీకి చెందిన 70 కుటుంబాల వారు గురువారం ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. చిప్పగిరిలోని స్వగృహంలో ఆయన వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరోసారి వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జగనన్నతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలన, అభివృద్ధిని చూసి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు కార్యకర్తలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబులేసు, మాజీ కో–కన్వీనర్ లోకనాథ్, గురు బాలగోపాల్, గురు రాముడు, కొక్క రామాంజనేయులు, కొండ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఉట్లోత్సవం

ఆస్పరి: జనార్ధన స్వామి ఉత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం భక్తుల ఆనందోత్సవాల మధ్య ఉట్లోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో పూజారి నరసింహ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి గంగపూజ, పంచామృతాభిషేకం, పల్లకీ సేవ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. యువత, చిన్నారులు ఆనందోత్సాహాలతో వసంతోత్సవం జరుపుకున్నారు. తప్పెట్లతో చిందులేస్తూ గ్రామంలోని వీధుల్లో కలియతిరిగారు. బంట్రోతు వారి ఇంటి నుంచి కుంభాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. తరువాత ఆలయం దగ్గర ఉట్టిని పగలగొట్టేందుకు యువకులు పోటీపడగా గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. యువకులు బురదలో పడిలేస్తూ చివరకు ఉట్టిని పగలగొట్టడంతో ఆట ముగిసింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

## డీఎస్పీ తనిఖీలు


వాహనదారులను తనిఖీ చేస్తున్న పత్తికొండ డీఎస్పీ

హొళగుంద: మండల పరిధిలోని మార్లమడికి వద్ద ఆంధ్రా–కర్ణాటక సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టును పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి గురువారం ఆలూరు సీఐ వెంకటేశ్వర్లుతో కలిసి తనిఖీ చేశారు. నిత్యం ఏఏ వాహనాలు తిరుగుతుంటాయి, కేసులు, అక్రమ మద్యం, నగదు పట్టుబడిందా ఇతర విషయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక నుంచి మద్యం, నగదు రవాణాను అరికట్టాలన్నారు. వాహనాల తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని హొళగుంద ఎస్‌ఐ పెద్దయ్యనాయుడుకు సూచించారు. ఆయా గ్రామాలలోని పోలింగ్ కేంద్రాల గురించి ఎస్‌ఐను అడిగి తెలుసుకున్నారు. అలాగే కర్ణాటకకు మారో మార్గమైన కె.బెళగల్‌కు వెళ్లే రోడ్డు హొన్నూరు కొట్టాల వద్ద వాహనాలను తనిఖీ చేశారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ తిమ్మయ్య, పోలీసు సిబ్బంది

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ.. నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఎమ్మిగనూరు మండలం పార్లపల్లి గ్రామానికి చెందిన కురవ ఉరుకుందు, కురవ లక్ష్మి అలియాస్ శంకరమ్మ, గురజాలకు చెందిన బెస్త శీను బైక్‌పై కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. కర్ణాటక మద్యం 186 జాన్స్ ఒరిజినల్ చాయిస్ విస్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, బైక్‌ను సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు కట్టుదిట్టం


రికార్డులను తనిఖీ చేస్తున్న సెబ్ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు కట్టుదిట్టం చేస్తున్నట్లు మంగళగిరి హెడ్‌క్వార్టర్స్ సెబ్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం స్థానిక సెబ్ కార్యాలయంను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులైన పంచలింగాల, సుంకేసుల, బాపురం, పెద్దహరివాణం చెక్‌పోస్టుల దగ్గర నిఘా కట్టుదిట్టం చేస్తామని చెప్పారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఏపీలోకి వచ్చే వాహనాలను చెక్‌పోస్టుల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే పంపాలన్నారు. అక్రమ మద్యం, నగదు, నిషేధిత సామగ్రి తరలింపును కట్టడి చేయాలని సూచించారు. అలాగే ప్రజలు సెబ్ అధికారులకు సహకరించాలని కోరారు. నేరచరిత్ర కలిగిన వారిని ముందుజాగ్రత్తగా బైండోవర్ చేయాలని ఆదేశించారు. కర్నూల్ డీటీఎఫ్ సీఐ నరసానాయుడు, సెబ్ ఎస్‌ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే


పత్తికొండలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


ఎమ్మిగనూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

పత్తికొండ రూరల్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతీరావ్ పూలే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. గురువారం పత్తికొండలోని నివాస గృహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఎంపీపీ నారాయణదాస్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, నాయకులు టీఎండీ హుసేన్, పెద్దహుల్తి నాగరాజు, కురవాల హుసేన్, వెంకటేష్, తలారి సంజన్న, తొగర్చేడు రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పార్టీ నాయకుడు బుట్టా యుగంధర్, బీసీ సంఘం జాతీయ నాయకుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, పార్టీ పట్టణాధ్యక్షుడు బుట్టా రంగయ్య, సునీల్‌కుమార్, భీమిరెడ్డి, రియాజ్‌అహమ్మద్‌తో పాటు పార్టీ శ్రేణులు పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే సేవలను కొనియాడారు.

ఎమ్మిగనూరుటౌన్: పూలే సేవలు చిరస్మరణీయమని రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, బీసీ సంఘ జాతీయ నాయకుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు పేర్కొన్నారు. పట్టణంలోని పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం 120 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

# లారీ ఢీకొని విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు


ఐరన్‌బండ గ్రామంలో విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

గోనెగండ్ల: మండల పరిధిలోని ఐరన్‌బండ గ్రామంలో ఉల్లిగడ్డల లారీ ఢీకొనడంతో 5 విద్యుత్ స్తంభాలు, ఒక ట్రాన్స్‌ఫార్మర్ విరిగిపడ్డాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో ఓ రైతు పండించిన ఉల్లిని లోడ్ చేసుకునేందుకు గురువారం ఉదయం కర్నూలు నుంచి లారీ వచ్చింది. లారీ రైతు పొలం వద్దకు వెళుతుండగా పైన ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో ఒకదానికి ఒకటి ఊగుతూ 5 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఓ స్తంభానికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కిందపడింది. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది గ్రామానికి చేరుకొని సరఫరా పునరుద్ధరించే పనులు చేపట్టారు. దీనిపై ఏఈ సుధాకర్‌రావు మాట్లాడుతూ.. ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, గ్రామంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు.

## కేంద్ర బలగాల కవాతు

మద్దికెర: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతి భద్రతలపై ప్రజలకు భరోసా కల్పించేందుకు పోలీసులు, కేంద్ర బలగాలతో కవాతు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బొజ్జనాయునిపేట, కొత్తపల్లి, బసినేపల్లి, మదనంతపురం గ్రామాలలో కవాతు నిర్వహించారు. గ్రామాలలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

# అక్రమ మద్యం తరలింపుపై నిఘా

ఆలూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక మద్యం అక్రమంగా తరలించే నిఘా ఉంచినట్లు సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ టి.విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం హాలహర్వి, హొళగుంద మండలల్లోని క్షేత్రగుడి, మార్లమడికి చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు సిబ్బంది మాట్లాడి పలు సూచనలు చేశారు. పొరుగు రాష్ట్రం నుంచి మద్యం, నగదు, ఇతర అనుమతి లేని సామగ్రి రాష్ట్రంలోకి రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేర చరిత్ర కలిగిన వారిపై నిఘా ఉంచాలని సూచించారు. సెబ్ సీఐ డి.సోమశేఖర్, స్పెషల్ సీఐ రవిచంద్ర, ఆలూరు సెబ్ పోలీసులు ఉన్నారు.


క్షేత్రగుడి చెక్‌పోస్టు సిబ్బందితో మాట్లాడుతున్న సెబ్ డిప్యూటీ కమిషనర్ టి.విజయ్‌కుమార్

# ఎల్లెల్సీకి నీటి సరఫరా బంద్

హొళగుంద: కర్ణాటకలోని హోస్పేట్ వద్ద ఉన్న టీబీ డ్యాం నుంచి తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి నీటి విడుదలను గురువారం నిలిపివేశారు. ఈ ఏడాది వర్షాభావం కారణంగా డ్యాంలో ఆశాజనకంగా నీరు చేరకపోవడంతో టీబీ బోర్డు అధికారులు గతేడాది డిసెంబర్ 25న కాలువకు నీటిని బంద్ చేసిన సంగతి తెలిసిందే. తిరిగి తాగునీటి అవసరాల కోసం ఫిబ్రవరి 19వ తేదీ నుంచి దిగువ కాలువకు 480 క్యూసెక్కుల ప్రకారం నీటిని వదులుతూ గురువారం నిలిపివేశారు. ఎండ తీవ్రత వల్ల డ్యాంలో నీటిమట్టం డెడ్ స్టోరేజీకు పడిపోతుండడంతో నీటి విడుదలను బంద్ చేసి మళ్లీ వర్షాకాలం మొదలై సకాలంలో డ్యాంలో నీరు చేరితే జూలై నెలలో విడుదల చేస్తారు. డ్యాంలో ప్రస్తుతం 1579.07 అడుగులతో 4.034 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో జీరో కాగా అవుట్ ఫ్లో 171 క్యూసెక్కులుంది. బళ్లారి పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ నెల 28వ తేదీ వరకు ఎల్లెల్సీకి 100 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగించనున్నారు.